ప్రజాశక్తి

శుక్రవారం 19 మే 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

ఎండల్లో కూలీలు విలవిల



మేడికొండూరు మండలం తురకపాలెంలో మట్టి పనుల్లో ఉపాధి హామీ కూలీలు

- ఉపాధి హామీ కార్మికులపై ప్రభుత్వం చిన్నచూపు
- తాగునీరు, మజ్జిగ కూడా సరఫరా చేయని వైనం
- పనిముట్ల అలవెన్సూ ఇవ్వడం లేదని కూలీల ఆవేదన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలకు ప్రభుత్వం అందించాల్సిన కనీస సౌకర్యాలు లభించడంలేదు. గుంటూరు, పల్నాడు జిల్లాలో ఉపాధి కార్మికులు పొలాల వద్ద మట్టి పనులు చేసేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వేసవి తీవ్రతతో రెండు జిల్లాలకు చెందిన ఉపాధి కార్మికులు అల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటలకే వేసవి తీవ్రత పెరుగుతోంది. వడగాల్పులు పెరిగాయి. ఉక్కపోతతో పనుల్లో ఉన్న కార్మికులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. పనులు జరిగే ప్రదేశాల్లో కనీస జాగ్రత్తలు కరువయ్యాయి. పలుగు,పారల వినియోగంలో దెబ్బలు తగలడం, పాములు, ఇతర విషజీవాల కాటుకు గురవ్వడం వంటి ఘటనల నుంచి తక్షణం ఉపశమనం పొందేందుకు ఫస్టు ఎయిడ్ బాక్సులు అందుబాటులో ఉండడం లేదు. మేడికొండూరు మండలం తురకపాలెంలో బుధవారం పనులు చేస్తుండగా పెద్ద పాము (కొండచిలువ) రాగా కూలీలు భయభ్రాంతులకు గురయ్యారు. తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేయడంలేదు. ఎండ వేడిమిని ఉపశమనం పొందేందుకు స్వల్ప విశ్రాంతి కోసం గతంలో టెంట్లు వేసే వారు. ఇప్పుడు కనీసం టెంట్లు వేయడం లేదు. ఉదయం 11 గంటలకన్నా పనులు ముగించి కార్మికులను నీడ ప్రదేశానికి తీసుకువెళ్లాలి. కానీ చాలా చోట్ల 11 గంటల తరువాత కూడా పనులు చేయిస్తున్నారు. పనులు పూర్తి చేసిన తరువాత ఫొటోలను అప్‌లోడ్ చేయాలని మధ్యాహ్నం 12 గంటలవరకు అక్కడే ఉండమని డ్వామా సిబ్బంది వత్తిడి చేస్తున్నారు.

గుంటూరు, పల్నాడు జిల్లాలోని గత వారం రోజులుగా పలు మండలాల్లో 45 నుంచి 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పల్నాడు జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 87,35,991 పనిదినాలు కల్పించాలని నిర్ణయించారు. గుంటూరు జిల్లాలో 30,85,104 పనిదినాలు కల్పించనున్నారు. ప్రస్తుతం ఎక్కువగా మట్టిపనులు చేయిస్తున్నారు. రహదారుల నిర్మాణం, కందకాలు తవ్వడం, కాల్వలను తవ్వడం, ఉన్న కాలువలను బాగుచేయడం, సాగునీటి పారుదలకు కాల్వగట్లను పటిష్టపర్చడం తదితరులు పల్నాడు జిల్లాలో ఎక్కువగా జరుగుతున్నాయి. గుంటూరు జిల్లాలో పట్టణ ప్రాంతాలు ఎక్కువగా ఉండటం వల్ల పనిదినాలు సంఖ్యాబాగా తగ్గించారు. అలాగే ఉపాధి హామీ చట్టం ప్రారంభం అయినప్పటి నుంచి ఎండా కాలంలో 20 నుంచి 30 శాతం సొమ్ము అలవెన్సు ఇచ్చే వారు. ఇటీవల ఈ అలెవెన్సును రద్దు చేశారు. దీనివల్ల ఎర్రటి ఎండలో చేతులు బొబ్బలు ఎక్కేలా పనిచేసినా కనీస కూలి రావడం లేదు. రోజుకు రూ.272 కనీస వేతనం ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.230 నుంచి

2లో



నరసరావుపేటలో కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం తెలుపుతున్న ప్రజాసంఘాలు

రెజ్లర్ల పోరాటానికి సంఘీభావ వెల్లువ

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ప్రజా సంఘాల నిరసనలు, కొవ్వొత్తులు వెలగించి ప్రదర్శనలు

8 లో

ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికుల ధర్నా - అధికారులకు వినతి

ప్రజాశక్తి-గుంటూరు



ధర్నాలో మాట్లాడుతున్న నేతాజి

ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని చెప్పుకుంటున్న ప్రభుత్వం గ్రామపంచాయతీల కార్మికులకు ఇచ్చిన హామీల అమలు ఏమైందో సమాధానం చెప్పాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నేతాజి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల పూర్తయినా గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదన్నారు. సమాన పనికి సమాన వేతనం

2లో

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ విఆర్ఒ

ఆన్‌లైన్‌లో పేరు నమోదుకు రూ.లక్ష డిమాండ్

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పొలాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు రూ.40 వేలు లంచం తీసుకుంటూ అబ్బూరుకు చెందిన విఆర్ఒ వినోద్ గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఎసిబి డీఎస్పీ టివివి ప్రతాప్ కుమార్ వివరాల ప్రకారం.. సత్తెనపల్లి మండలం అబ్బూరుకు చెందిన తక్కెళ్లపాటి వెంకాయమ్మకు 2.55 ఎకరాల పొలం వుంది. వెంకాయమ్మకు పిల్లలు లేక పోవటంతో సోదరుడు భార్య అయిన పులబోలు కోటమ్మకు దఖలు రిజిస్ట్రేషన్



ఏసిబి కి చిక్కిన వీఆర్వో వినోద్

2లో

జిజిహెచ్‌లో సాయంత్రమూ ఓపీ

- 3-4 గంటల వరకు సేవలు
- ప్రారంభించిన సూపరింటెండెంట్

2 లో

విద్యుత్ కోత-ఉక్కపోత

- సరఫరాలో పెరుగుతున్న అంతరాయం
- రాత్రివేళల్లో అదనపు లోడ్ రిలీఫ్ పేరుతో నిలిపివేత

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



గుంటూరులో విద్యుత్ కోతను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న జనం

వేసవి తీవ్రతతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో విద్యుత్ కోతలు పెరిగాయి. అదనపు లోడ్ రిలీఫ్ పేరుతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆకస్మికంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రోజుకు 17 నుంచి 18 మిలియన్ యూనిట్ల కోటా ఉండగా 20 మిలియన్ యూనిట్లు వినియోగం ఉంటుందని అధికారులు చెబుతుండగా రాత్రి వేళ ఏసీలు, కూలర్ల వినియోగం గణనీయంగా పెరిగింది. ఎండ తీవ్రతకు విద్యుత్ పరికరాలుకూడా దెబ్బతింటున్నాయని, వీటిని మరమ్మతుల కోసం కొన్ని సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని అధికారులు అంటున్నారు. విటిపిఎస్‌లో విద్యుత్ ఉత్పత్తిలో అంతరాయం ఏర్పడటం వల్ల

2లో

సీలింగ్, మిగులు భూముల క్రమబద్ధీకరణకు అవకాశం 3లో



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ కెఎస్, సిపిఎం నాయకులు

తాడేపల్లిలో సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-గుంటూరు

తాడేపల్లి మండలంలోని ప్రజలెదుర్కొనే వివిధ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. వడ్డేశ్వరం, కొలనుకొండ గ్రామాల్లో అనేక సంవత్సరాలుగా పేదలు ప్రభుత్వ భూముల్లో ఇళ్ళు వేసుకుని నివాసముంటున్నారని, వారికి పట్టాలు మంజూరు చేయాలని, చిర్రావూరులో దళితులకు శ్మశాన స్థలం కేటాయించాలని కోరారు. గ్రామంలో పశుసంపద ఎక్కువగా వుందని, ఆశుపత్రికి పక్కాభవనం వున్నా డాక్టరు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వెంటనే డాక్టర్‌ను కేటాయించాలని కోరారు. గుండిమెడలో తాగునీటి సమస్య వుందని, ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి తాగునీరు అందించాలన్నారు. అపార్ట్‌మెంట్స్ నిర్మాణాలు పెరిగిపోయాయని, భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా వుందన్నారు. భూగర్జ జలాలు కలుషితమవుతున్నాయని, భూగర్భ డ్రెయినేజీ

2లో



పోటీల పోస్టర్ ఆవిష్కరణలో శాయిరేవతి, తదితరులు

20, 21న పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశక్తి-తెనాలి

ఈనెల 20, 21 తేదీల్లో పట్టణానికి చెందిన క్విక్ ఫిట్‌నెస్ ఎరేనా ఆధ్వర్యంలో 10వ సబ్ జూనియర్, జూనియర్ క్లాసిక్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇంటర్నేషనల్ వెయిట్ లిఫ్టర్, క్విక్ జిమ్ ఆర్గనైజర్ ఘట్టమనేని సాయిరేవతి గురువారం వెల్లడించారు. పోటీల కరపత్రాలను స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. జెట్టి అమ్మయ్య అండ్ నాగభూషణం సదన్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిధిగా స్థానిక ఎమ్మెల్యే ఎ.శివకుమార్ పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఈదర వెంకటపూర్ణచంద్, కన్నెగంటి మురళి, పి.రామకృష్ణ పాల్గొన్నారు.



టిడిపి హయంలోనే మైనార్టీలకు ప్రోత్సాహం

టిడిపి నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ గురువారం తన కార్యాలయంలో మైనార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.టిడిపి రాష్ట్ర మైనారిటీవిభాగం ఉపాధ్యక్షులు హాజీ షేక్ అఫ్జల్ హజ్ యాత్రకు వెళుతున్న సందర్భంగా ఈసమావేశం జరిగింది. డేగల ప్రభాకర్ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి హజ్ యాత్రలకు టిడిపి ప్రభుత్వంలో తగిన ప్రో త్సహం అందించినట్టు తెలిపారు.

మహానాడు ఏర్పాట్లలో డేగలకు చోటు

ఈ నెల 27,28,29 తేదీలలో రాజమండ్రిలో జరగనున్న టిడిపి మహానాడుకు పార్టీ అధిష్టానం అలంకరణ కమిటీలో గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ స్థానం కల్పించారు.ఈ సంధర్బంగా డేగల ప్రభాకర్ తన పై నమ్మకం ఉంచి మహానాడు కమిటీలో కీలక భాద్యతలు అప్పగించినందుకు పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు,రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ లకు కతజ్ఞతలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతను సమర్దవంతంగా నిర్వహిస్తానని డేగల ప్రభాకర్ తెలిపారు.

నాగార్జున కొండను సందర్శించిన మయన్మార్ బృందం

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ప్రముఖ పర్యాటక ప్రాంతమైన నాగార్జున కొండను మయన్మార్ మత వ్యవహారాలు,సాంస్కృతిక మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. ఈ బృందంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ న్యోమైంట్‌టున్, అసిస్టెంట్ డైరెక్టర్లు టున్‌టున్‌ఎయ్, ఫియోఫ్యాకెకో, మే మైట్‌నోకో ఉన్నారు. ముందుగా విజయపురిసౌత్ లోని హరిత రిసార్ట్ కు చేరుకున్న ఈ బృందానికి టూరిజం మేనేజర్ శ్రీనివాస్ స్వాగతం పలికారు. హరిత రిసార్ట్ లో ఆతిథ్యం స్వీకరించిన అనంతరం నాగసిరి లాంచీలో కొండకు చేరుకున్నారు. అక్కడ మ్యూజియంలోని బుద్ధుని చరిత్ర, పాలరాతి విగ్రహలను, శిల్పాలను, ప్రధాన స్థూపాలతో పాటు పురాతన ఆనవాళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

జిజిహెచ్‌లో సాయంత్రమూ ఓపీ

- 3-4 గంటల వరకు నిర్వహణ
- ప్రారంభించిన సూపరింటెండెంట్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఈవినింగ్ క్లినిక్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.ప్రభావతి గురువారం ప్రారంభించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) ఆదేశాల మేరకు ఆసుపత్రిలో ఓపీ సేవలు ప్రారంభించామని ఆమె చెప్పారు. అంతకు ముందు ఓపీ ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉండేదని, ఇక నుంచి సాయంత్రం మూడు గంటల నుంచి నాలుగు గంటల వరకు ఈవెనింగ్ క్లినిక్ పేరుతో ఓ పి సేవలు అందిస్తామని తెలిపారు. ఓపీలో వైద్యులు రాసిచ్చిన వ్యాధి నిర్ధారణ పరీక్ష ఫలితాలను అదే ఓపీలో వైద్యులకు చూపించాలన్నారు. దానికి వల్ల రోగులకు అత్యవసర సేవలు పొందడానికి అవకాశం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్‌ఎంఒ డాక్టర్ బి.సతీష్ కుమార్, డిప్యూటీ ఆర్‌ఎంఒ డాక్టర్ ఝాన్సీ పాల్గొన్నారు.

విద్యుత్ కోత-ఉక్కపోత

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు చాలాప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలిగిందన్నారు.

రాత్రి సమయాల్లో ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్తు ఆపేస్తున్నారంటూ బుధవారం రాత్రి 11 గంటల నుంచి అర్ధరాత్రి 2గంటల వరకు ఆర్టీసీ బస్టాండ్ వెనుక గల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి-5 సెక్షన్ కార్యాలయం ముందు నిరసనకు దిగారు. పాత గుంటూరు, అలీ నగర్, శుద్ధపల్లి డొంక, ఆంజనేయస్వామి గుడి వీధి, భూర్లు వారి వీధికి చెందిన ప్రజలు స్థానికప్రతిరోజు రాత్రి సమయంలో కరెంటు పోతుందని, కరెంట్ ఆఫీస్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసిన బిజీ వస్తోందని, ఎండల తీవ్రత అధికంగా ఉన్న ఈ సమయంలో రాత్రి వేళల్లో కరెంటు పోవడం వల్ల వుక్కపోతకి పిల్లలు నిద్రపోవ-ట్లేదని విధులు పట్ల నిర్లక్ష్యం చూపిస్తున్న ఏఈపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ధర్నా చేశారు.

పల్నాడు జిల్లా దాచేపల్లి పట్టణంలో బుధవారం అర్ధరాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పిడుగురాళ్ల పట్టణంలో అర్ధరాత్రి అప్రకటిత విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దోమల దాడికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అచ్చంపేట మండలంలో బుధవారం రాత్రి 10 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ కోతలు అమలు చేశారు. తెనాలిలో బుధవారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటలవరకు రెండున్నర గంటలపాటు ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ నిలిపివేశారు. పగటి సమయంలో కూడా పలు మార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గురువారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి మూడున్నర వరకు విద్యుత్ సరఫరా లేదు. పగలంతా తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఎండల్లో కూలీలు విలవిల

(మొదటి పేజీ తరువాయి)

రూ.250 మాత్రమే అందుతున్నాయని తెలిపారు. పనిచేసే చోట భద్రత, మంచినీళ్లు, టెంట్ రానుపోను ఛార్జీలు, గునపం, పార, తట్ట ఇవ్వాల్సి ఉండగా వాటిని మీరే తెచ్చుకోండని అధికారులు చెబుతున్నారని కూలీలంటున్నారు. వీటికి సంబంధించి సొమ్ము మీఖాతాల్లో జమచేస్తామని మీరే అన్ని తెచ్చుకోవాలని చెబుతున్నా అందుకు తగిన సొమ్ము రావడంలేదని కార్మికులు తెలిపారు.

సమ్మర్ అలవెన్సుఇవ్వండి : ఈమని అప్పారావు

ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్సును పునరుద్ధరించాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు కోరారు. పెరిగిన ఖర్చుల దృష్ట్యా వేతనంలో 40 శాతం సమ్మర్ అలవెన్సు అదనంగా ఇవ్వాలన్నారు. 100 రోజులు పూర్తి చేసిన కుటుంబానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచూపాలన్నారు. పనిచేసే చోట టెంట్, తాగునీరు, మెడికల్ కిట్ ఏర్పాటు చేయాలని కోరారు. నీళ్లకు రూ.10, గునపం, తట్టకురూ.20, సానకు రూ.50 ఇవ్వాలన్నారు. అన్‌లైన్ మస్టర్ విధానం రద్దు చేసి పాతపద్ధతిని అమలు చేయాలని, పేస్లిప్‌లను ఇవ్వాలని కోరారు. క్షేత్రస్థాయిలో మేట్లకు స్మార్టు ఫోన్, రోజుకు రూ.5 పారితోషికం ఇవ్వాలన్నారు. తాడేపల్లి, మంగళగిరి, రాజధాని ప్రాంతంలో కూడా ఉపాధి పనులు కల్పించాలన్నారు.

తాడేపల్లిలో సమస్యలపై కలెక్టర్‌కు వినతి

(మొదటి పేజీ తరువాయి)

వ్యవస్థను నిర్మాణం చేయాలని కోరారు. అర్హులైన పేదలను గుర్తించి 3 సెంట్లు ఇళ్ల స్థలాలివ్వాలని, హామీ పత్రాలు ఇచ్చిన వారికి వెంటనే ఆయా గ్రామాలలోని ఇళ్ల స్థలాలివ్వాలని కోరారు. ప్రాతూరు, చిర్రావూరు, గుండిమెడ ఇసుక క్యారీలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రేవేంద్రపాడు వంతెన శిధిలావస్థలో వుందని అనేక గ్రామాలకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారని, కొత్తవంతెన నిర్మాణం చేయాలని కోరారు. మెల్లెంపూడి నుండి నూతక్కి రోడ్డు విధిలావస్థలో వుందని వెంటనే రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. తాడేపల్లి రూరల్ మండలాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి, నాయకులు పి.కృష్ణ, బి.శ్యాంశాన్, బి.గోపాలరావు, పి.సుబ్బారావు, కె.స్వాతి ఉన్నారు.

మద్దతు ధరకు పసుపు కొనుగోలు చేయాలి

పసుపు పంటను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనగోలు చేయాలని కలెక్టర్‌కు రైతు సంఘం నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ ఏడాది అకాల వర్షాల వల్ల పంట దిగుబడి తగ్గిందని, ఎకారాకు కౌలుతో సహా రూ.2 లక్షలు ఖర్చవుతున్న నేపథ్యంలో ప్రభుత్వమే కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర, క్వింటాళ్‌కు రూ.6850 ఉండగా ప్రైవేటు వ్యాపారులు కేవలం రూ.5000కే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయ ఖర్చు పెరగడంతో మద్దతు ధర కనీసం రూ.10వేలు నిర్ణయించాలని కోరారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ విఆర్‌ఒ

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. వెబ్‌ల్యాండ్‌లో కోటమ్మ పేరు బదులు వేరే వారి పేరు నమోదైంది. ఆన్‌లైన్లో కోటమ్మ పేరు నమోదు చేసేందుకు వీఆర్వో వినోద్ రూ.లక్ష లంచం డిమాండ్ చేశాడు. తొలుత రూ.59 వేలను కోటమ్మ బంధువైన మానుకొండ నరసింహారావు ఇచ్చారు. మూడు నెలల నుండి తిరుగుతున్న పనిచేయక పోగా ఇంకా రూ.40 వేలు ఇస్తేనే పని అవుతుందని చెప్పటంతో మానుకొండ నరసింహారావు ఈనెల 16న అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో మానుకొండ నరసింహారావు నుంచి స్థానిక సచివాలయంలో రూ.40 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడిచేసి పెట్టుకున్నారు. గ్రామంలో వచ్చిన అప్లికేషన్లు ఎన్ని పరిష్కరించారు? ఎన్ని పెండింగ్ పెట్టారు? ఎందుకు పెండింగ్ పెట్టారు? అనే వివరాలనూ సేకరించారు. పట్టుబడిన విఆర్‌ఒ వినోద్ నుంచి స్టేట్‌మెంట్‌ను, తహసీల్దార్ కె.నగేష్ సెంట్మెంట్ నమోదు చేశారు. ఏసీబీ సిఐలు బి.నాగరాజు, సిహెచ్ రవిబాబు, జి.అంజిబాబు, ఎ.మన్మథరావు, వి.సురేష్‌బాబు, ఎస్ఐ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేస్తామని వాగ్దానం చేశారని, పంచాయతీలోని పర్మినెంట్ కార్మికులకు ఇచ్చే జీతంలో నాలుగో వంతు కూడా టెండర్, పార్ట్ టైం కార్మికులకు ఇవ్వట్లేదని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయడమంటే ఇదేనా అని ప్రశ్నించారు. చిన్న ఉద్యోగులందరికీ రూ.10 వేలకు తక్కువ లేకుండా జీతం చెల్లిస్తామని వాగ్దానం చేశారని, గ్రామ పంచాయతీ కార్మికులలో 70 శాతం మందికి రూ.10 వేలైనా జీతం రావట్లేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకం వల్ల కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు అందించిన గ్రీన్ అంబాసిడర్లు అత్యధిక మంది ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. గతేడాది వరకు వీరి జీతాలు కేంద్ర ప్రభుత్వ నిధుల నుండి చెల్లించారని ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం నిధులు నిలిపివేయడంతో వీరి జీతాల చెల్లింపు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇప్పటికే అత్యధిక పంచాయతీలలో కరెంటు బిల్లు సహా కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితులలో కునారిల్లు తున్నాయని, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల్లేక ఇబ్బంది పడుతున్న పంచాయతీలపై గ్రీన్ అంబాసిడర్ల జీతాల భారం కూడా పడడంతో చాలా పంచాయితీలు చేతులెత్తేస్తున్నాయని తెలిపారు. దీనివల్ల ఏళ్ల తరబడి అతి తక్కువ జీతంతో పనిచేసిన గ్రీన్ అంబాసిడర్లు పనులు కోల్పోయి వారి కుటుంబాలు వీధిన పడాల్సి వస్తుందన్నారు. గ్రామంలో పారిశుధ్య విధులు నిర్వర్తించే వారు లేక మురుగు పేరుకుపోయే వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందన్నారు. గ్రీన్ అంబాసిడర్లందర్నీ కొనసాగించాలని వారికి ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా టెండర్, పార్ట్ టైం కార్మికుల రెన్యువల్ కోసం పంచాయతీల నుండి ప్రతిపాదనలే అధికారులకు పంపలేదని, తక్షణమే కార్మికులందరికీ రెన్యువల్ ఆర్డర్లు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి సిహెచ్.సురేష్ ధరల పెరుగుదలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, బకాయి జీతాలు చెల్లించాలని, పిఎఫ్, యూనిఫారం, సబ్బులు, నూనెలు, గుర్తింపు కార్డులు తదితర సౌకర్యాలు అన్ని అమలు చేయాలని కోరారు. ధర్నా అనంతరం ప్రదర్శనగా డిపిఒ కార్యాలయానికి వెళ్లి సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందించారు. ధర్నాలో సిఐటియు జిల్లా కార్యదర్శులు బి.లక్ష్మణరావు, ఎన్.శివాజీ, యూనియన్ జిల్లా నాయకులు డి.వి.నరసింహారావు, ఇబ్రహీం, కార్మికులు పాల్గొన్నారు.

ఏసీబీ అధికారులమంటూ మోసం

దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులో ఘటన



సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టిన సీఐ, బాధితుడు గుర్తుపట్టిన నిందితుడి ఫోటో

ప్రజాశక్తి-దుగ్గిరాల

ఏసీబీ అధికారులమని బెదిరించి మోసానికి పాల్పడిన సంఘటన మండలం లోని కంఠంరాజు కొండూరులో గురు వారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన విశ్రాంత పురోహితుడు పావులూరి తారకనాథ్ శర్మ (కంఠంరాజు కొండూరు శివారులోని శ్రీ మహంకాళి అమ్మ వారి ఆలయంలో పురోహితుడిగా పని చేసిన) ఇంటికి ఉదయం నాలుగు గంటల 30 నిమిషాల సమయంలో ముగ్గురు వ్యక్తు లు వచ్చారు. తాము ఏసీబీ కార్యాలయం నుండి వచ్చా మని, ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు ఫిర్యాదు వచ్చిం దని చెప్పి తారక్‌నాథ్ ఇంట్లోకి వెళ్లికి తలుపులు బిగించి ఇల్లంతా సోదా చేశారు. రూ.50 వేలు, బం గారు రుద్రాక్షలు, ఒక జత బంగారు చెవి దిద్దులు తీసుకొని లక్ష రూపాయల చెక్కు మీద సంతకం చేయించుకున్నారు. గంట సేపు ఈ వద్ధ దంపతు లను కాలకృత్యా లకు కూడా వెళ్లకుండా బాధించారని బాధి తులు వాపోతున్నారు. అక్కడి నుంచి వెళ్లే సమ యంలో అందు లోని ఒక వ్యక్తి ఫోన్ నెంబర్ ఇచ్చాడని, విజయవాడ బస్టాండ్ పై ఉన్న తమ కార్యాలయం ఉందని, అవసం్మైతే ఫోన్ చేయమని చెప్పారని అన్నారు. ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని వచ్చిన కారు లో పరారయ్యారు. షాక్ నుండి తేరుకున్న తారకనాథ్ వెంటనే తనకు పరిచయం ఉన్న ఏసీబీ అధికారికి ఫోన్ చేసి ఈ విషయం తెలిపారు.ఆయన వాకప్ చేసి తమ కార్యా లయం నుండి ఎవరు రాలేదని స్వయంగా పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. తారకనాథ్ కూడా దుగ్గిరాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ వ్యక్తి ఇచ్చిన నెంబర్‌కు ఫోన్ చేయగా ట్రూ కాలర్ అతని ఫోటో లభించిందని, బాధితుడు అతని గుర్తించి పోలీసులకు ఆ ఫోటోను అందజేశారు. వెం టనే బ్యాంకుకు వెళ్లి తమ ఖాతాను కూడా స్తంభింపజేశారు. మంగళగిరి రూరల్ సిఐ భూషణం సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరుపుతున్నారు.





గ్యాస్ లీకై హోటల్ దగ్ధం

బాలికకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - వినుకొండ

వంట గ్యాసు లీకై న ఘటనలో హోటల్ దగ్ధం కాగా, బాలికకు గాయాలైన సంఘటన మండలంలోని ఏనుగు పాలెంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామంలోని దావులూరి శ్రీనివాసరావు హోటల్‌లో ఉదయం హెూటల్ నిర్వహణ సాగుతుండగా వంట గ్యాస్ లీక్ కావటంతో మంటలు ఎగిసాయి. దగ్గరలో ఉన్న తన కుమార్తె సంధ్య పై నూనె పడటంతో తీవ్రంగా గాయపడింది. గ్యాస్ లీక్ దిగిసిన మంటలతో నిర్వాహకులు, ప్రజలు భయభ్రాం తులతో పరుగులు తీశారు. గాయపడిన సంధ్యను 108 ద్వారా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన ప్రాంతానికి చేరుకొని మంటలు అదుపు చేశారు. అగి ్నప్రమాదంలో లక్షన్నర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధ్యతలు తెలిపారు.

సీలింగ్, మిగులు భూముల క్రమబద్ధీకరణకు అవకాశం

ప్రజాశక్తి-గుంటూరు

పట్టణ భూపరిమితులు చట్టం, 1976 ప్రకారం ప్రభుత్వ పరిధిలోకి వచ్చిన సీలింగ్ భూములు, మిగులు భూముల క్రమబద్ధీకరణకు గతంలో ఇచ్చిన జిఒ 36కు కొన్ని సవరణలు చేస్తూ జిఒ 84 జారీ చేసినందున క్రమబద్దీకర ణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గుంటూరు తూర్పు మండల తహశీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2023 డిసెంబర్ 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 150 చదరపు గజాల వరకూ ఉచితంగా డి పట్టా మంజూరు చేయబడుతుందని, 150-300 చదరపు గజాల వరకూ బేసిక్ విలువలో ప్రభుత్వానికి శాతం చెల్లించాల్సి ఉంటుం దన్నారు. 300-400 చదరపు గజాలు ఉన్న వారు బేసిక్ విలువలో 30శాతం, 500 చదరపు గజాలకు పైబడిన వారు వందశాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ మొత్తాన్ని దరఖాస్తు సమయంలో, ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నెల గడువులోగా రెండు దఫాలుగా చెల్లించవచ్చ న్నారు. క్రమబద్ధీకరించుకోవటానికి అర్హుల కు కన్వేయన్స్ డీడ్ ఇవ్వబడుతుందని, 2019 మే 1కి ముందు రిజిస్టర్ అయిన డాక్యుమెంట్‌కు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటా మన్నారు. క్రమబద్ధీకరణ విలువ చెల్లించిన వారి భూములను సొంత ఖర్చులతో వారి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవ టానికి అవకాశం కల్పించటమే కాకుండా, నిషేధిత భూముల జాబితా నుండి ఆయా భూములను తీసివేయటానికి చర్యలు తీసుకుంటామన్నారు. డి పట్టా పొందిన వారికి పదేళ్ల తర్వాత బదలాయింపు చేసే అవకాశం ఉంటుందన్నారు. కావున అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూమిలో 2019 మే 1కి ముందు నివాస గృహాలు ఏర్పాటు చేసుకున్న వారు సదరు గృహానికి సంబంధించిన విద్యుత్ కనెక్షన్, నిర్మాణ అనుమతిపత్రం, కుళాయిపన్ను రశీదు, ఇతర ఆధారాలతో తహశీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఓటర్ల జాబితా క్లెయిమ్‌లను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్ క్లెయిమ్‌లను 24వ తేదీ నాటికి సక్రమంగా పరిష్కరించాలని ఇఆర్వోలు, ఎఇఆర్వోలను జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. ఓటర్ క్లెయిమ్స్ పరిష్కారం, తదితర ఎన్నికల అంశాలపై కలెక్టర్లతో రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్ ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరు క్లెయిమ్స్‌కు సంబంధించి నూతన ఓటరు దరఖాస్తులు, మార్పులు, చేర్పులు, తొలగింపు దరఖాస్తులు బీఎల్‌వోలు, విత్ ఇన్ ఎస్ఎల్ఎలో సక్రమంగా పరిష్కరించేలా ఈఆర్వోలు, ఏఈఆర్వోలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మే 31 నాటికి అర్హుల జాబితా-2ను ప్రకటించాలని, అందుకు అనుగుణంగా పెండింగ్ క్లెయిమ్స్ వెంటనే పరిష్కరించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు, ఈఆర్వోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లలితా, వెంకట శివరామిరెడ్డి, గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పి.రోజా, ఏఈఆర్వోలు తెనాలి, తుళ్లూరు, పొన్నూరు తహశీల్దార్లు రవిబాబు, ఫణీంద్రబాబు, శ్రీకాంత్, జిఎంసి డిప్యూటీ కమిషనర్లు వెంకట కృష్ణయ్య, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణలో న్యాయ సేవాధికార సంస్థ సహకారం



నడింపల్లి జానకిశైలజను అభినందిస్తున్న చంద్రమౌళీశ్వరి

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

జిల్లాలో వద్ధులు, అనాథ బాలలు ఎదుర్కొంటున్న సామా జిక, న్యాయ సమస్యల పరిష్కారా నికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తుందని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి చంద్రమౌళీశ్వరి పేర్కొన్నారు. గురువారం స్థానిక శ్రీనగర్ ఏడవ లైను మాతశ్రీ వద్ధుల ఆశ్రమం, రవీంద్రనగర్ మాతశ్రీ చైల్డ్ కేర్ హెూమ్ నిర్వాహకురాలు నడింపల్లి జానకి శైలజ 67వ జన్మదినం వేడుకల సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి చంద్రమౌళీశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీనగర్ ఆశ్రమంలో కేక్ కత్తిరించి వద్ధులకు, బాలలకు నూతన వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి చంద్రమౌళీశ్వరి మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వద్ధులకు అందవలసిన వద్ధాప్య పింఛన్లు, ఆధార్ కార్డులు, వైద్య పరమైన సేవలు సక్రమంగా అందేవిధంగా ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తారని తెలియజేశారు. వద్ధులను కుటుంబ సభ్యులు అకారణంగా వేధించటం వారి ఆస్తులను అక్రమంగా కాజేసి వారిని మానసికంగా వేధించే వ్యక్తు లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత 24 సంవత్స రాలుగా వద్ధుల, బాలల ఆశ్రమాలను నిర్వహిస్తున్న నడింపల్లి శైలజ, విజయ ప్రసాద్ దంపతులను అబి నందించారు. కార్య క్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యులు మహేష్, జిల్లా గ్రం థాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, రాష్ట్ర ఎస్టీ ఉద్యో గుల సం ఘం ఉపాధ్యక్షులు ఉయ్యాల టైగర్ ప్రసాద్, ప్రజా ఆలో చన వేదిక అధ్య క్షులు మేడూరి రాజేంద్ర ప్రసాద్, మాలకొం డయ్య పాల్గొన్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

నందిపాటి కుమారస్వామి, తండ్రి వీరరాఘవయ్య, వయస్సు 60, డోర్. నెం. 12-1657-2, పాటిమీధ అంకమ్మచెట్టు, చిలకలూరిపేట టౌన్, పల్నాడు జిల్లా వాస్తవ్యుడనైన నేను, నా తాలూకు ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్లు నెం.6711/2010, తేది.06 మే 2010, నెం.724/1980, తేది. 06 మార్చి 1980 ను ది.15-5-2023న ఇస్సప్పాలెంలో బండిపై తిరుగు చుండగా మార్గమధ్యంలో ఎక్కడో పోయినవి. ఎవరి కైనా దొరికిన యెడల పై అడ్రసుకు కానీ లేదా క్రింది నెంబరుకు కానీ తెలుపగలరు. నందిపాటి కుమారస్వామి సెల్ : 8466018080.

ఆటో బోల్తా - నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్: ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో నలుగురు గాయపడ్డారు. ఈ సంఘటన సత్తెన పల్లి మండలం పాకాలపాడు సమీపంలో గురువారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో రెంటపాళ్ళ గ్రామానికి చెందిన కోట వెంకటేశ్వర్లు తోకల రాములుకు తీవ్ర గాయాలయ్యాయి,తోకల వీరయ్య , మహాలక్ష్మమ్మ లు స్వల్పంగా గాయపడ్డారు.సత్తెనపల్లి నుండి రెంటపాళ్ళ వెళుతున్న ఆటో పాకాలపాడు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయిన ఆటో బోల్తా పడటంతో ఈ ప్రమాదం సంభవించింది. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం నర్సరావుపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బడ్జెట్ తగ్గించి కూలీల పొట్టగొడుతున్న కేంద్రం

- ఉపాధి హామీ పని ప్రదేశాలను సందర్శించిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు
- 22న కలెక్టరేట్ వద్ద ధర్నా జయప్రదానికి పిలుపు



నకరికల్లు మండలం నరసింగపాడు, దాచేపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న లక్ష్మీశ్వరరెడ్డి, ఇతర నాయకులు

ప్రజాశక్తి - నకరికల్లు

ఉపాధి హామీ చట్టానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బడ్జెట్ కుదించి పేదల పొట్టగొడుతోందని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నరసింగపాడులో ఉపాధి హామీ పని ప్రదేశాలను నాయకులు గురువారం సందర్శించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రెండు పూటలా పని రద్దు చేయాలని, సమ్మర్ అలవెన్స్ 40 శాతం ఇవ్వాలని, వంద రోజులు పూర్తి చేసిన కుటుంబాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ మస్టర్ విధానాన్ని తెచ్చి కూలీలను ఇబ్బంది గురి చేస్తున్నారని, మేట్‌ల వ్యవస్థనూ నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న ఈ విధానాలను తిప్పికొట్టడానికి కూలీలంతా ఐక్యంగా పోరాడాలని, అందులో భాగంగా 22న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాకు కూలీలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధి హామీ మేట్‌లు రామిరెడ్డి, ఎ.కోటేశ్వరి, పి.శ్రీనివాస్‌రెడ్డి, మంగిరెడ్డి, సిహెచ్ అనురాధ, వి.ఝాన్సీ, ఎ.లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దాచేపల్లి

ఉపాధి హామీ పనులను పాత పద్ధతిలోనే చేయించాలని సిఐటియు మండల కార్యదర్శి ఆంజనేయరాజు డిమాండ్ చేశారు. దాచేపల్లిలో ఉపాధి హామీ పని ప్రదేశాలను నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా కూలీలతో ఆంజనేయరాజు మాట్లాడుతూ గతంలో 20 మందికి ఒక మేట్ ఉండేవారని, వారే కూలీలను పనులకు తెచ్చి కొలతల ప్రకారం పని చేయించేవారని చెప్పారు. ఇందుకుగాను ఒక్కో కూలీకి రూ.10 చొప్పున అలవెన్స్‌ను మేట్‌కు ఇచ్చేవారని అన్నారు. దీంతోపాటు తాగునీరు, పనిముట్ల అలవెన్సునూ ఇప్పుడు ఇవ్వడం లేదన్నారు. చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయడం కోసం ఏడాదికి 200 రోజులకు పని దినాలు కల్పించాలని, కూలినీ పెంచాలని కోరారు. అనంతరం ఎపిఒ మల్లికార్జునరావుతో మాట్లాడారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, మేట్‌లు, కూలీలు వీరమ్మ, బుజ్జమ్మ, సైదమ్మ, శ్రీలక్ష్మి, ధనలక్ష్మి, ఆలయ సైదా, చిరంజీవి, హాసన్, సైదా, మౌనిక, మాధవి, సామ్రాజ్యం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

పనులను త్వరితగతిన పూర్తి చేయండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

నాడు -నేడు, జగనన్న గృహ నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతి నిధులు సంయుక్తంగా బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. సత్తెనపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో గురువారం ఎంపిపి షేక్ యలవర్తిపాటి జైబూన్‌బీ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ వేసవి సెలవులు పూర్తయ్యేలోగా పాఠశాలలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. మరుగుదొడ్లు, వంటగదులు, అదనపు గదుల నిర్మాణాలను, తాగునీటి వసతి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మండల పరిధిలో కేటాయించిన జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వేదిక కావాలని అన్నారు. సమావేశంలో రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్లం విజయభాస్కర్‌రెడ్డి, ఎంపిడిఒ సత్యనారాయణ, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు యజమానులు సహకరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

వేసవి తీవ్రతకు గురికాకుండా భవననిర్మాణ కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎ.ప్రసాదరావు, షేక్ సిలార్ మసూద్ సూచించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. భవన నిర్మాణ కార్మికులు తమ పనివేళలను సవరించుకొని ఉదయం 6 గంటల నుండి 11 గంటలలోపే పనులు ముగించుకొని ఇళ్లకు వెళ్లాలని వారు సూచించారు. మజ్జిగ తెచ్చుకుని అవసరమైనప్పుడు తాగాలని, వీటిని కార్మికులకు యజమానులు అందజేసి సహకరించాలని ప్రకటనలో కోరారు.



చెక్కును అందిస్తున్న ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి

తోటి హోంగార్డు కుటుంబానికి వితరణ

ప్రజాశక్తి - నరసరావుపేట

గుండెపోటుతో మృతి చెందిన హోం గార్డు కుటుంబానికి పల్నాడు హోం గార్డులు ఒకరోజు వేతనం వితరణగా ఇవ్వడం అభినందనీయమని పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అన్నారు. మాచర్ల పట్టణ పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న పేరం ఆత్మాంజనేయులు గతేడాది అక్టోబర్‌లో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి బాసటగా నిలిచేందుకు హోంగార్డులు సమకూర్చిన రూ.5.38 లక్షల చెక్కును మృతుని కుటుంబానికి ఎస్పీ గురువారం అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ వై.రవికిరణ్ పాల్గొన్నారు.

దేశంలోని ప్రాజెక్టులకు సత్రశాల ఆదర్శం

కర్బన ఉద్గారాల విడుదలపై అధికారుల పరిశీలన, వివరాల సేకరణ



ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు, ప్రాజెక్టు వద్ద పచ్చిక

ప్రజాశక్తి - రెంటచింతల

హైడల్ పవర్ ప్రాజెక్టులు పర్యావరణానికి రక్షా అని, వీటివల్ల వాతావరణ కలుషితమయ్యే అవకాశం లేనేలేదని ఆడిట్‌కు సంబంధించి హై పవర్ కమిటీ సభ్యులు ఇషాన్ శ్రీవాస్తవ, ఆమన్‌శర్మ అన్నారు. సత్రశాలలోని నాగార్జునసాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టును వారు గురువారం సందర్శించి జల విద్యుత్ ద్వారా కర్బన ఉద్గారాలు ఏమైనా విడుదలై పర్యావరణానికి హాని చేస్తున్నాయా? అనే దానిపై అధికారులతో తొలిసారిగా సమీక్షించారు. బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు, జల విద్యుత్ కేంద్రాలకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. 2015 తర్వాత నిర్మించిన ప్రాజెక్టుల తనిఖీల్లో భాగంగా ఈ ప్రాజెక్టులో ఎన్ని క్రస్ట్ గేట్లు, రిజర్వాయర్లో నీటి నిల్వ సామర్థ్యం, రోజుకి ఎన్ని మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, ఈ ప్రాజెక్టు కింద ఎన్ని హెక్టార్లు కేటాయించారు, ఎంతమంది ఇంజనీర్లు ఇతర ఉద్యోగులు, వైద్య సదుపాయాలు తదితర విషయాలకు సంబంధించిన సమాచారాన్ని రాతపూర్వకంగా తీసుకున్నారు. పచ్చదనానికి ఈ ప్రాజెక్టు దేశంలో ఉన్న ప్రాజెక్టులకు రోల్ మోడల్ అని కొనియాడారు. సమీక్షలో ఎస్ఇ వెంకటరమణ, ఇఇ కె.శ్రీకాంత్, నరసింహారావు, డిఇ నాగరాజు, ఎడిఇ రామాంజనేయులు పాల్గొన్నారు.

అందుకే మీసం తిప్పి సవాలు చేశా : ఎమ్మెల్యే బొల్లా

ప్రజాశక్తి - వినుకొండ

'మీసం తిప్పి చూసుకుందాం రండి రా' అని తాను టిడిపి శ్రేణులతో సవాలు చేసిన మాట వాస్తవమేనని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. నాలుగు రోజుల కిందట టిడిపి శ్రేణులు వినుకొండ నుండి శావల్యాపురం వరకూ టిడిపి జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్నారని, శావల్యాపురం వద్ద జాతీయ రహదారిపై జనం కిక్కిరిసి ఉండడంతో రెండు వైపులా నాలుగు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ నిలిచిపోయిందని చెప్పారు. అదే సమయంలో నరసరావుపేట నుండి వినుకొండకు తాను వస్తున్నానని, తనను చూసిన 400 మంది టిడిపి శ్రేణులు ఎగబడి అసభ్యంగా మాట్లాడారని అన్నారు. వారి మాటలకు తట్టుకోలేని తాను తాను కారు దిగి సవాలు చేశానని, పౌరుషం ఉన్న ప్రతిఒక్కరూ అదే చేస్తారని అన్నారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన టిడిపి నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించానని చెప్పారు.



విలేకర్లతో మాట్లాడుతున్న బ్రహ్మనాయుడు

ఇదిలా ఉండగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వ్యాఖ్యలపైనా ఎమ్మెల్యే స్పందించారు. స్థానిక మసీదు మాన్యంలో పేదలు లేరని, అందరూ చీకటి వ్యాపారులేనని వ్యాఖ్యానించారు. మసీదు మాన్యం భూములను అన్యాక్రాంతం కాకుండా సంరక్షించాలని హైకోర్టు ఉత్తర్వులిచ్చిందని, ఆ ఆదేశాలను జిల్లా కలెక్టర్ అమలు చేస్తారని అన్నారు. 2 వేల ఎకరాల చుక్కల భూములను అనుభవిస్తున్న నియోజకవర్గంలోని 9 వేల మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం హక్కుల కల్పించిందని, పట్టణంలోని బ్రహ్మనాయుడు కళ్యాణమండపంలో దీనిపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. అగ్రహార భూములకు సంబంధించి ఆయా గ్రామాల్లో జరిగిన భూ సర్వేలో సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వం సేకరించిందని, వీటిపైనా రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు.



సిపిఎం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం : ఎస్ఐ

ప్రజాశక్తి - రెంటచింతల

అసెంబ్లీకి సైకిల్‌పై వెళ్లిన నిరాడంబరమైన ప్రజానాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని రెంటచింతల ఎస్ఐ సమీర్‌బాష అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన రెంటచింతలలో నిర్వహిస్తున్న చలివేంద్రాన్ని ఎస్ఐ గురువారం సందర్శించారు. అనంతరం స్థానికులకు మజ్జిగ, చల్లని నీటిని అందించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడల్లో జిల్లాకు కీర్తిప్రతిష్టలు తేవాలి

క్రీడాపరికరాలు, దుస్తులు అందించిన కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి - నరసరావుపేట

క్రీడలకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకుని, కీర్తి ప్రతిష్టలు తేవాలని క్రీడాకారులకు పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల శాఖ ద్వారా సమకూర్చిని క్రీడా దుస్తులు, క్రీడా పరికరాలను కోచ్‌లకు పట్టణంలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో కలెక్టర్ గురువారం అందించారు. వేసవి క్రీడల శిక్షణ నిర్వహణలో భాగంగా ప్రతిభ కలిగిన క్రీడాకారులకు మరింత ప్రోత్సహించాలన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన సీఎం కప్ టోర్నమెంట్‌లో పల్నాడు జిల్లా క్రీడాకారులు తృతీయ బహుమతిని సాధించడంపై కలెక్టర్, జెసి శ్యాప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో స్టెప్ సిఇఒ పల్లవి, స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ యాదవ్ పాల్గొన్నారు.



నాలుగు వారాలుగా కూలివ్వలేదు

వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల ఎదుట కూలీల ఆవేదన



ఉపాధి హామీ పథకం కూలీలతో మాట్లాడుతున్న అప్పారావు, రామకృష్ణ

ప్రజాశక్తి - మేడికొండూరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మేడికొండూరు మండలం మంగళగిరిపాడు పంచాయతీ తురకపాలెంలో పని ప్రదేశాలను సంఘం నాయకులు గురువారం సందర్శించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 4 వారాల నుండి కూలి డబ్బులు పడటం లేదని, పే స్లిప్పులు ఇవ్వకపోవడం వల్ల తమ ఖాతాల్లో డబ్బులు ఎంత పడ్డాయో కూడా తెలియడం లేదని వాపోయారు. పని కోసం 6 కిలో మీటర్ల దూరం వెళ్తున్నామని, రవాణా ఖర్చులను తామే భరిస్తున్నామని, పని ప్రదేశాల్లో ప్రథమ చికిత్స కిట్లు కూడా అందుబాటులో లేవని వివరించారు. తాగునీరుకు, పనిముట్లకు అలవెన్సు, సమ్మర్ అలవెన్సు ఇవ్వడం లేదని చెప్పారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ కూలీలకు ఆదరువుగా ఉన్న ఈ చట్టాన్ని దెబ్బతీయడానికే బిజెపి ప్రభుత్వం పూనుకుందని, అందుకే కూలీలకు అసౌకర్యాలు కల్పిస్తోందని, పలు రకాల నిబంధనలు తెస్తోందని చెప్పారు. రెండు పూటల పని విధానం, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం తదితరాలు అమలు చేసి కూలీలు ఎలాగైనా పనికి రాకుండా చేయడానికి కుట్రలు పన్నుతోందన్నారు. ఉపాధి హామీకి 2021-22లో బడ్జెట్‌లో రూ.90 వేలకోట్లు కేటాయిస్తే గత బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లే కేటాయించారని తెలిపారు. గతంలో 90 శాతం నిధులు కూలీలకు, 10 శాతం నిధులు యంత్రాలు కేటాయించగా ప్రస్తుతం కూలీలకు ఇవ్వాల్సిన శాతాన్ని 60 శాతానికి కుదించారని విమర్శించారు. ఈ నేపథ్యంలో చట్టాన్ని కాపాడుకోవడానికి, పటిష్టంగా అమలు చేయించుకోవడానికి కూలీలంతా ఐక్యంగా పోరాడాలన్నారు. ఇందులో భాగంగా 22న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కౌరు రైతు సంఘం నాయకులు బి.రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని మరింత పటిష్టం చేస్తూ కేరళలోని వామపక్ష ప్రభుత్వం చర్యలు తీసుకుందని, కూలీల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేసిందని తెలిపారు.



పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

సుందరయ్య, సుందరరావు వర్థంతి సందర్భంగా

నిడమర్రులో వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

మండలంలోని నిడమర్రులో పుచ్చలపల్లి సుందరయ్య, నూతక్కి సుందర్‌రావు మాస్టారు వర్థంతి సందర్భంగా ఆటల పోటీలను గురువారం ప్రారంభించారు. సిపిఎం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. తొలిరోజు పోటీలను స్థానిక నాయకులు ప్రారంభించగా కార్యక్రమంలో నాయకులు ఎం.భాగ్యరాజు, జి.నాగేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వర్లు, కె.ప్రకాశరావు, టిడిపి గ్రామ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా



ఎంటిఎంసి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇతర కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ కె.హేమమాలినికి వినతి పత్రం అందజేశారు. సిఐటియు నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, ఎం.రవి, బి.వెంకటేశ్వర్లులు మాట్లాడుతూ కార్మికులు దీర్ఘకాలికంగా సమస్యలు ఎదుర్కొంటున్నారని, పలుమార్లు విన్నవించినా పరిష్కరించడం లేదని విమర్శించారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు ఆన్‌లైన్‌లో ఉద్యోగుల చూపి ఇళ్ల స్థలాలు, అమ్మఒడి, ఆరోగ్యశ్రీ తదితర సంక్షేమ పథకాలు రద్దు చేశారని, వాటిని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలన్నారు. విలీన గ్రామాల పారిశుధ్య కార్మికులకు రూ.21 వేల జీతం, క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18,500 అమలు చేయాలని, రాజధాని సిఆర్‌డిఎ కార్మికులను కార్పొరేషన్‌లో విలీనం చేసి 105 మందికి కార్మికులకు మూడు నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని, విలీన గ్రామాల పారిశుధ్య కార్మికులకు చెప్పులు, సబ్బులు, నూనెలు యూనిఫామ్, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని కోరారు. ఎండ తీవ్రంగా ఉన్నందున మధ్యాహ్నం షిఫ్ట్ మూడు గంటల నుండి 6 గంటల వరకు మార్చాలని, పిఎఫ్ నాలుగు నంబర్లు సరిచేసి ఒకే నంబర్లోకి డబ్బులు జమ చేయాలని, ఇఎస్ఐ కార్డులు మున్సిపల్ అధికారులే తయారు చేసి కార్మికులకు ఇవ్వాలని కోరారు. ఆదివారం సెలవు కార్పొరేషన్‌లో అన్నిచోట్లా అమలు చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్ జీతాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మంగళగిరి పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, యూనియన్ నాయకులు పి.పూర్ణ, కె.గోపి, కె.వెంకమ్మ, పి.మేరీ, ఎస్.శాంతి, జి.నాంచారమ్మ పాల్గొన్నారు.

పనులను గడువులోగా పూర్తి చేయాలి

లే అవుట్‌లలో అభివృద్ధి పనులను పరిశీలించిన సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్



పిచుకలపాలెంలో పనులను పరిశీలిస్తున్న వివేక్‌యాదవ్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతంలో పేదలకు సెంటు స్థలం పంపిణీకి సంబంధించిన లే అవుట్‌లలో అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్ ఆదేశించారు. దొండపాడు సమీపంలోని పిచికలపాలెం లే అవుట్‌లో పనులను ఆయన గురువారం పరిశీలించి మాట్లాడారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన పేదలకు సెంటు స్థలం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. రెండు జిల్లాల్లోని అర్హులైన వారికి నిడమర్రు, కృష్ణాయపాలెం, నవులూరు, ఐనవోలు, మందడం, కురగల్లు, యర్రబాలెం, పిచికలపాలెం, బోరుపాలెం, నెక్కల్లు అనంతవరం ప్రాంతాల్లోని 1402.58 ఎకరాల్లో 25 లే అవుట్‌లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మొత్తం 51,392 మంది లే అవుట్ లలో అభివృద్ధి చేయనున్న ప్లాట్లను సిఎం జగన్ మోహన్‌రెడ్డి ద్వారా పంపిణీకి ప్రభుత్వం సంకల్పించిందన్నారు. సిఎం ఆదేశాల మేరకు మొదటి దశలో ఎన్‌టిఆర్ జిల్లాకు కేటాయించిన 583.93 ఎకరాల్లో 11 లే అవుట్‌లు, గుంటూరు జిల్లాకు కేటాయించిన 550.65 ఎకరాల్లో 10 లే అవుట్‌లలో 40,502 ప్లాట్లను అభివృద్ధి చేశామన్నారు.

ఇదిలా ఉండగా జీవో 59 ప్రకారం ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మరో 268 ఎకరాలలో చేపడుతున్న లే అవుట్ అభివృద్ధి పనుల్లో భాగంగా గురువారం పిచికలపాలెంలో పనుల పురోగతిని పరిశీలించారు. 268 ఎకరాలలో అభివృద్ధి చేస్తున్న లే అవుట్‌లలో ఎన్‌టిఆర్ జిల్లా లబ్ధిదారులకు ఇచ్చే బోరుపాలెంలో 2.05 ఎకరాలు, పిచికలపాలెంలో 101.56, అనంతవరంలో 64.39 ఎకరాలు, గుంటూరు జిల్లా లబ్ధిదారులకు నెక్కల్లులో 100 ఎకరాల్లో 10,890 ప్లాట్లు ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేశామని కమిషనర్‌కు అధికారులు వివరించారు. ఆయా లే అవుట్‌లలో జంగిల్ క్లియరెన్స్ పూర్తి చేశామన్నారు. సంబంధిత కాంట్రాక్టు సంస్థలు పనులు ప్రారంభిస్తాయని వివరించారు. 1,402.58 ఎకరాల్లో 25 లే అవుట్‌లు వేసి మొత్తం 51,392 ప్లాట్లను అభివృద్ధి చేస్తున్నామని, ఈ ప్లాట్లను పేదలకు సిఎం ద్వారా అందిస్తామని కమిషనర్ తెలిపారు. ప్రస్తుతం ప్లాట్ల ఏర్పాటుకు అనువుగా లెవెలింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. కాంట్రాక్టు సంస్థలు అంతర్గత గ్రావెల్‌తో రోడ్లు అభివద్ధి, ప్లాట్ల లో హద్దు రాళ్ళు సమకూర్చి లబ్ధిదారులకు ఆవాసయోగ్యంగా ఇళ్ల స్థలాల మార్కింగ్‌తో నంబరింగ్ వేయడం తదితర పనులు యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నట్లు చెప్పారు. పరిశీలనలో సిఆర్‌డిఎ చీఫ్ ఇంజినీర్ జివి పల్లంరాజు, ఉద్యోగులు ఉన్నారు.


రాత్రి వేళ లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

నిడమర్రులో రాత్రివేళల్లోనూ ఇసుక, మట్టి లోడుతో తిరుగుతున్న లారీలను గ్రామస్తులు బుధవారం రాత్రి అడ్డుకున్నారు. లారీ మోతతో, వాటి వేగం వల్ల వచ్చే దుమ్ముతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని మండిపడ్డారు. రాత్రి వేళ బయటకు రావాలంటేనే భయంగా ఉంటోందని, పొద్దున్నే నడకకూ ఇబ్బందిగా మారిందని చెప్పారు. కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే గ్రామంలో రోడ్లు దిగ్బంధం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.



రహదారిపై అడ్డుకున్న లారీ వద్ద స్థానికులు



కెఎల్‌యులో 'స్వేచ్ఛ' కంప్యూటర్ శిక్షణ ముగింపు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కెఎల్ విశ్వవిద్యాలయం వడ్డేశ్వరం గ్రీన్ ఫీల్డ్ క్యాంపస్‌లో స్వేచ్ఛా టీం ఆధ్వర్యంలో కంప్యూటర్‌లపైన సుమారు 400 మంది 8,9 తరగతుల విద్యార్థులకు పది రోజుల పాటు ఉచిత శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కెఎల్ విశ్వవిద్యాలయం స్వేచ్ఛా కమిటీ, అధ్యాపకులు శ్రీపతిరాయ్ గురువారం తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 7,8 తరగతులు చదువుతున్న విద్యార్థినీ , విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరంలో కెఎల్‌యు స్వేచ్ఛా టీం తరుపున తాము కంప్యూటర్‌లో మెలకువలు నేర్పుతున్నామన్నారు. ఈ వయస్సు నుండి కంప్యూటర్ పట్ల అవగాహన పెంచుకుంటే పై తరగతులకు వెళ్లిన సమయంలో ఈ పరిజ్ఞానం ఉపయోగపడుతుందన్నారు. తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల మండలాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు, ప్రయివేటు హైస్కూళ్ల విద్యార్థులు కూడా ఈ ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరానికి హాజరయినట్లు తెలిపారు. కంప్యూటర్ శిక్షణతో పాటు సామాజిక అంశాలపైన నాటికలు, ఇంద్రజాలం, ఇంటి వద్దనే చేయగల సైన్స్ ప్రయోగాల పట్ల బాల బాలికలకు పది రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు పాల్గొన్నారు.



స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి

మాతృభాష తెలుగును మరువవద్దని, మాతృభాషను కాపాడుకుంటూనే ఇంగ్లీషు కూడా నేర్చుకోవాలని వక్తలు చెప్పారు. తాడేపల్లి సుందరయ్యనగర్‌లో గురువారం స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రారంభ సభకు విజ్ఞాన కేంద్రం బాధ్యులు కె.కరుణాకరరావు అధ్యక్షత వహించారు. స్పోకెన్ ఇంగ్లీషు ఉపాధ్యాయులు ఎం.రత్నకమల్, రాష్ట్ర బాలోత్సవాల కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ ఎస్.వెంకట్రావు, మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడారు. పిల్లలు సృజనాత్మకంగా ఆలోచించడం మంచి పరిణామమన్నారు. ఈ రోజు మాతృభాష అవసరం ఎంతో ఉందని చెప్పారు. దాంతో పాటు పెరుగుతున్న టెక్నాలజీ పరంగా చూస్తే ఇంగ్లీషు భాష కూడా అవసరం ఉంటుందని తెలిపారు. అందుకు తగ్గట్టుగానే ఇంగ్లీషులో మెలకువలను, పటుత్వాన్ని పిల్లలకు నేర్పడానికే ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20 రోజుల పాటు జరిగే ఈ శిక్షణా తరగతులు పిల్లల్లో ఇంగ్లీషు పట్ల ఆత్మస్థైర్యం పెరుగుతుందని ఆకాంక్షించారు. తెలుగు భాష, రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని వివరించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు ఘన సత్కారం

- ప్రభుత్వ విద్యా సంస్థల్లో టెన్త్, ఇంటర్మీడియట్ చదివి ఉండాలి
- విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకూ సన్మానం
- 25న జిల్లా, 27న నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాలు
- పల్నాడు కలెక్టర్ ఎల్.శివశంకర్



ప్రజాశక్తి-నరసరావుపేట

పదో తరగతి, ఇంటర్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి స్థానంలో నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘన సత్కారం నిర్వహిస్తునట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పేర్కొన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్ లు,విద్యా శాఖ అధికారులతో గురువారం రాష్ట్ర వ్యాప్తంగా 10వ తరగతి,ఇంటర్ మీడియట్ విద్యార్థినీ, విద్యార్థుల లో టాపర్లు గా నిలిచిన వారికి ఘన సత్కారం నిర్వహించే అంశం పై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా స్థాయిలో మొదటి, రెండవ, మూడవ స్థానం లో ఎస్ ఎస్ సీ లో టాపర్లుగా నిలిచిన వారికి నగదు ప్రోత్సాహకాలు వరుసగా రూ. 50, 30, 10 వేలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు, సన్మానం ఉంటా యని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అధికారులు విద్యార్థులు పాల్గొంటారని వీటిని అధికారులు ఘనంగా నిర్వహించాలని తెలిపారు. పల్నాడు జిల్లా ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి కలెక్టర్, విద్యా శాఖాధికారులతో కలిసి కలెక్టరేట్ నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ ఎస్‌సి, ఇంటర్మీడియేట్ పరీక్షలలో ప్రభుత్వ విద్యాలయాల్లో చదివి మెరుగైన ఫలితాలు సాధించిన టాపర్ విద్యార్థులను, వారి తల్లి దండ్రులను, పాఠశాల యాజమాన్యం ను సన్మానం చేసే కార్యక్రమాలను ఈ నెల 25న నియోజకవర్గ స్థాయిలో, 27న జిల్లా స్థాయిలో, 31న రాష్ట్ర స్థాయి కారక్రమా లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో ప్రజా ప్రతినిధులు అధికారులు విద్యార్థులు పాల్గొంటారని వీటిని అధి కారులు ఘనంగా నిర్వహించాలని తెలి పారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీ డియట్ అధికారి నీలావతి, జిల్లా విద్యా శాఖ అధి కారి శ్యాముల్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి-పెదకూరపాడు

రీ సర్వేకి రైతులు సహకరించాలని పల్నాడు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సర్వేర్ నాగ శేఖర్ అన్నారు. పెదకూరపాడు మండలంలోని తాళ్లూరు గ్రామంలో గురువారం రీసెర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈ సర్వే చేసేటప్పుడు రైతులు తమ వద్ద ఉన్న పొలానికి సంబంధించింది డాక్యుమెంట్స్ తీసుకోమని హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేర్ నాగ శ్రీనివాస్, మండల డిప్యూటీ తహశీల్దార్ నిర్మలాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

టిసిఎస్‌లో 'కృష్ణవేణి' విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-నరసరావుపేట

ఐటి రంగంలో దిగ్గజ కంపెనీ అయిన టిసిఎస్‌లో తమ కళాశాల విద్యార్థులు 19 మంది ఉద్యోగాలు సాధించారని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. కంపెనీ ప్రతినిధులు ఈ నెల 5న ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించి 13న విజయవాడ కెబిఎన్ కళాశాలలో ఇంట ర్వ్యూలు నిర్వహించారని, వివిధ కళాశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొనగా 70 మంది విద్యార్థులు ఎంపికయ్యారని వీరిలో తమ కళాశాలకు చెందిన 19 మంది ఉన్నారని వివరించారు. వీరికి రూ.2.80 లక్షల వార్షిక వేతనం దక్కుతుందన్నారు. తమ కళాశాలలో విద్యార్థులకు విద్యతో పాటు ఉద్యోగ ఉపాధి సాధనే ద్యేయంగా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, అర్థమాటిక్, రీజనింగ్, టెక్నికల్ స్కిల్స్ ట్రైనింగ్ వలన బహుళజాతి కంపెనీల్లో ఇంజినీరింగ్ విద్యార్థులకు దీటుగా నిలిచి డిగ్రీ ద్వారా ఉద్యోగాలు సాధించారని చెప్పారు. విద్యార్థుల అభినందన సభ కాలేజీలో గురువారం నిర్వహించగా కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, టిపిఒ ఎం.బాలకోటేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు పాల్గొని ఎంపికైన వారిని అభినందించారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన వైవి ఆంజనేయులు



ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

నిత్యం రాజకీయాలు చేయడమే కాకుండా ప్రజల అవసరాలను గుర్తించి సామాజిక సేవలు చేయాల్సిన అవసరం ఉందని సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వై వి ఆంజనేయులు అన్నారు. రాజుపాలెం మండల పార్టీ అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు ఆధ్వర్యంలో రాజుపాలెంలో ఏర్పాటు చేసిన మంచి నీటి చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. పతి రోజూ వివిధ పనుల నిమిత్తం ప్రధాన రహదారిలో ప్రయాణించే ప్రయాణికులు, చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు, వాహనదారులు, బాటసారులు కోసం ప్రజల సౌకర్యార్థం చల్లని మంచినీటి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం తెలుగుదేశం పార్టీ అభిమాని పోలూరి నాగులు(80) బుధవారం మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు, నాగులు ఇంటికి వెళ్లారు. అతని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మట్టి ఖర్చుల నిమిత్తం ఐదు వేలు అందజేశారు. తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని హామీ యిచ్చారు.

పెండింగ్‌లో ఉన్న ఫామ్-6,7,8 క్లైములు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-నరసరావుపేట



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న కలెక్టర్. పక్కన జాయింట్ కలెక్టర్, డిఆర్వో

గురువారం విజయవాడ నుంచి పెండింగ్ లో ఉన్న ఫామ్-6,7,8 క్లైములు, కొత్త రివైజ్డ్ వర్షన్, వివిధ అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్‌లు, తదితరులతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.స్థానిక కలెక్టరేట్ లో వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి, తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఫామ్-6,7,8 క్లైములు త్వరగా పూర్తి చేయాలన్నారు. కొత్తగా రివైజ్డ్ వర్షన్ ఈఆర్ఓ.నెట్ 2.0కు సంబంధించి ఎలాంటి అనుమానాలు, ఉన్న సమస్యలు తెలియజేయాల న్నారు. ఎలక్షన్లు ఎలా నిర్వహించాలనేదానిపై ఎస్ఓ పిలను పలు వురు జిల్లా కలెక్టర్ లను అడిగి తెలుస కున్నారు. ఈవీఎంలు ఎక్కడ భద్రపరుస్తున్నారనే విషయాలను ఆరా తీశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కొత్త వెర్షన్లో డేటా ఎంట్రీ పూర్తయ్యాక ఎపిక్ నెంబర్లు డిస్‌ప్లే కావడం లేదని, ఫామ్-7లో పోలింగ్ స్టేషన్ వివరాలు డిస్ ప్లే కావ డం లేదని, నోటీస్ నెంబర్లు 13, 14 జన రేట్ కావడం లేదని ఎన్నికల అధికారికి తెలియజేశారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాలు కచ్చి తంగా పాటించాలని అన్నారు. నియోజకవర్గాల సహా ఎన్నికల అధికారులతో కలె క్టర్ మాట్లాడుతూ ఈవీఎంలు సక్రమంగా భద్రపరిచేందుకు గోడౌన్ లు పూర్తి స్థాయిలో భద్రత ప్రమాణాల మేరకు అందుబాటులో ఉండేలా చూడాలనీ ఆదేశించారు. క్లెయిమ్స్ పెండింగ్ ఫారం 6,7,8 ఎన్నికల కమిషన్ రూల్స్ ప్రకారం పాటించి, సమగ్ర విచారణ జరిపి పరిష్కరించాలని తెలిపారు. బి ఎల్ వో లు గతంలో ప్రొఫార్మా తప్పులు లేకుండా నమో దు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు, తహశీల్దార్లు, సంబంధిత బిఎల్ఓ లకు, రెవెన్యూ సిబ్బందికి తెలియజేయాల్సిన బాధ్యత మీ పైన ఉన్నదని ఆర్డిఓ లను ఆదేశించారు. బిఎల్ఓ లు రిజిస్టర్లు నిర్వహణ, సమగ్రంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గాల సంబంధిత ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొల్లాపై సుమోటోగా కేసు నమోదు చేయాలి

జీవీ ఆంజనేయులు డిమాండ్

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ: టిడిపి కార్యకర్తలపై కవింపు చర్యలకు పాల్పడి మీసం తిప్పి తొడగొట్టి రండిరా చూసుకుందాం అంటూ అసభ్యకర పదజాలంతో రెచ్చగొట్టేందుకు పూనుకున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాలని పలనాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. నూజెండ్ల మండలం ములకలూరు గ్రామంలో ఇదేమి ఖర్మ కార్యక్రమంలో పాల్గొన్న జీవీ ఆంజనేయులు మీడియాతో మాట్లాడారు. ఈనెల 15వ తేదీన ప్రశాంతంగా యువ గళం పాదయాత్ర వంద రోజులు పూర్తి అయిన సందర్భంగా సంఘీభావ పాదయాత్ర ప్రశాంతమైన వాతావరణంలో చేసుకుంటున్న టిడిపి కార్యకర్తలపై ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విచక్షణను మరిచి, ఎమ్మెల్యే పదవినీ అఘోరవపరుస్తూ వీధి రౌడీలా మీసం మేలేసి తొడ కొట్టి 'రండిరా చూసుకుందాం' అంటూ రెచ్చగొట్టేందుకు ప్రయత్నించిన బొల్లా బ్రహ్మనాయుడు పై సుమోటోగా కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల టిడిపి అండగా ఉండి పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మ్యూజియం డే

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి పురాతన వస్తువులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని అమరావతి కమ్యూనిటీ వైద్యశాల అధికారి డాక్టర్. చందూలాల్ అన్నారు. ఈ సందర్భంగా చందూలాల్ గురువారం మాట్లాడుతూ.. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా స్థానిక పురావస్తు సంగ్రహాలయం (మ్యూజియం) నందు ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు 55 మంది వ్యాసరచన పోటీలలో పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.

మున్సిపల్ కమిషనర్, చైర్మన్‌కు టిడిపి వినతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఎన్‌టిఆర్. సుజల ప్లాంట్ కు ఒప్పందం ప్రకారం రా వాటర్ సరఫరా చేసే విషయమై పట్టణ ప్రధాన కార్యదర్శి పటాన్ హమ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో పట్టణ మునిసిపల్ కమిషనర్,చైర్మన్‌కు వినతి ప్రతాలను గురువారం అందజేశారు.. ఈ సందర్భంగా టిడిపి కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివా సరావు మాట్లాడుతూ పట్టణ ప్రాంతంలోను, శివారు ప్రాంతాలలో నివశించే పేద ప్రజలకు మినరల్ వాటర్ ను అందించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వ హయంలో ఎన్.టి.ఆర్. ట్రస్ట్ వారిని ఒప్పించి పట్టణంలో సమ్మర్ స్టోరేజ్ టాంక్ వద్ద సుజల ప్లాంట్ ను ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు. త్వరితగతిన ప్లాంటుకు నీటి సరఫరా విషయంలో చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి మరోమారు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

కొనసాగుతున్న పిఎస్‌వికె మజ్జిగ చలివేంద్రం



ప్రజాశక్తి-సత్తెనపల్లి

పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం పిఎస్ వికె ఆధ్వ ర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో ఏర్పాటుచేసిన మజ్జిగ కేంద్రం గురువారం ఏడవ రోజు కొనసాగుతూ ఉంది. దాతలు ధరణికోట పుల్లారావు, విమలాలు చలివేంద్రాన్ని ప్రారంభించారు. పిఎస్‌వికె నిర్వాహకులు పి.సూర్య ప్రకాశరావు, పవన, జె.రాజకుమార్, ఆర్. పురుషోత్తం, కె.శివదుర్గారావు, ఇంజన్ లింగయ్య, పి.మహేష్ పాల్గొన్నారు.

పోలీసులు ఆశ్రయించిన టిడిపి నేత



ప్రజాశక్తి - మాచర్ల

బాకీ తీర్చాక కూడా ఇంకా డబ్బులు ఇవ్వాలంటూ తన ఇంట్లో దొరబడి దౌర్జన్యం చేస్తున్నారని తన రక్షణ కల్పించాలంటూ టిడిపి నాయకుడు ఎర్రం పోలిరెడ్డి గురువారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు . పోల్ రెడ్డి మాట్లాడుతూ గతంలో మా బంధువులైన వారికి కొంత బాకీ పడ్డ మాట వాస్తవమేనని అవి చెల్లించటం కోర్టులో కేసు కొట్టేయించుకోవడం కూడా జరిగిందని తెలిపారు. కొన్నాళ్ల తర్వాత తిరిగి ఇప్పుడు వచ్చి వాళ్ల తనకు బాకీ ఉన్నామంటూ తన ఇంట్లో జొరబడి నన్ను ఇబ్బంది పెడుతున్నారని, రక్షణ కల్పించాలంటూ పోలీసులు ఆశ్రయించానని పోల్ రెడ్డి తెలిపారు. పోల్ రెడ్డి మాచర్ల నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ జూలకంటి బ్రహ్మనందరెడ్డికి ప్రధాన అనుచరుడు, సమీప బంధువు.

వాలంటీర్ కుటుంబాన్ని ఆదుకుంటాం

ప్రజాశక్తి - మాచర్ల: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వాలంటీర్ కొరటా వెంకటేష్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుం టామని మాచర్ల మున్సిపల్ కమిషనర్ రమణబాబు అన్నారు. పట్టణానికి సంబంధించిన అన్ని వార్డు సచివాలయాల తరపున ఒక లక్ష మూడు వేల ఆరు వందల రూపాయలను గురువారం వెంకటేష్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు.

పత్తిపాటి ఫౌండేషన్ ఆర్థికసాయం

ప్రజాశక్తి - యడ్లపాడు: యడ్లపాడులోని, బోయ కాలనీకి చెందిన కామినేని గోపి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా గోపి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. అతనికి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఇచ్చిన రూ.20,000ను బాధిత కుటుంబానికి యడ్లపాడు మండల అధ్యక్షులు ఎం.నాగేశ్వరావు, పి.రాఘవయ్య, పి.ప్రసాద్, పి.హరిబాబు, పి.రత్తయ్య, వై.ఆంజనేయులు, భాస్కర్ నాయక్ ద్వారా అందజేశారు.

'వాత్సల్య' దరఖాస్తులు సక్రమంగా పరిశీలించాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో మిషన్ వాత్సల్య పథకం స్పాన్సర్‌షిప్ అండ్ ఫాస్టర్ కేర్ కార్యక్రమానికి అందించిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సక్రమంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాల్ రెడ్డి ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాల్‌రెడ్డి అధ్యక్షతన స్పాన్సర్ షిప్ అండ్ ఫాస్టర్ కేర్ అప్రూవల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలె క్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మిషన్ వాత్సల్య స్పాన్సర్ షిప్ అండ్ ఫాస్టర్ కేర్ కార్యక్రమం ద్వారా వితంతువులు, విడాకులు పొందిన మహిళల పిల్లలు, తల్లిదండ్రులు కోల్పోయి సంరక్షకుల వద్ద ఆశ్రయం పొందుతున్న పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే పిల్లలు, కుటుంబాలలోని పిల్లలు, పీయం కేర్ పథకం క్రింద నమోదైన పిల్లలకు ఈ పథకం ద్వారా ప్రతి నెల ఆర్ధిక సాయం అందిస్తుందన్నారు. జిల్లాలో ఈ పథకానికి అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరి శీలించి అర్హుల జాబితాను సిద్ధం చేయాల న్నారు. సంరక్షణ గహాల్లో ఆశ్రయం పొం దుతున్న పిల్లలకు ఇంటి వాతావరణం ఉం డేలా సౌకర్యాలు కల్పించేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ప్రమీల, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారిణి మనోరంజని, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారిణి దుర్గా భవాని, శిశు గహం మేనేజర్ శరణ్యా, సీడ్స్ యన్ జి ఓ డైరెక్టర్ రోషన్ కుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



దివీస్ ఫార్మా కంపెనీలో ఉద్యోగాలకు చలపతి ఫార్మసీలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి - తాడికొండ : లాం చలపతి ఫార్మశీ కళాశాలలో హైదరాబాద్ దివీస్ కంపెనీ ప్రతినిధులు గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. దివీస్ లాబొరెటరీస్ హెచ్ఆర్ కె.హరికష్ణ, పూర్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో బి ఫార్మశీ, ఎం.ఫార్మశీ విద్యార్థులకు సూపర్‌వైజర్, లాబ్ హెల్పర్ విభాగాల్లో ఉద్యోగాల కోసం ఎంపికలు చేపట్టారు. కళాశాల ప్రిన్సిపల్ రామారావు మాట్లాడుతూ ఈ ఎంపికల్లో గుంటూరు జిల్లాలోని పలు కళాశాలల నుండి 70 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. అర్హత పొందిన విద్యార్థులు హైదరాబాద్ దివీస్ లాబొరేటరీలో ఉద్యోగ నిర్వహణకు అనుమతులు ఇస్తారని తెలిపారు. విద్యార్థులందరికీ మొదట టెక్నికల్ రౌండ్ తదుపరి వ్యక్తిగత ఇంటర్వ్యూలను నిర్వహించగా 28 మంది అర్హత సాధించారని తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులందరికీ కళాశాల ప్రిన్సిపల్ రామారావు, చైర్మన్ వై.వి ఆంజనేయులు అభినందనలు తెలియజేశారు.

ఉత్సాహంగా సాగుతున్న శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మేకా అమరారెడ్డి భవన్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరుగుతున్నాయి. గురువారం ప్రముఖ మేజీషియన్, విశ్రాంత ఎంపిడిఒ ఎస్.ఆదినారాయణ మ్యాజిక్ పిల్లలను ఆకట్టుకుంది. గ్లాసులో నీళ్లు పోసి అందులో ఇసుకను వేసి మంత్రించి రంగు నీళ్ల తెప్పించిన మాయాజాలం పిల్లలను ఆశ్చర్యచకితుల్ని చేసింది. చేతిరుమాలులో అగ్గిపుల్ల పెట్టి దాన్ని ముక్కలుగా చేసి మరలా ఒకే అగ్గిపుల్లగా తెప్పించడం పిల్లలను సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. అనంతరం పిల్లలకు ఆయన పలు నీతికథలు చెప్పారు. శిబిరంలో నిర్వాహకులు భీమవరపు దశరథరామిరెడ్డి, సోలా ముత్యాలరావు పాల్గొన్నారు.

బాలల రక్షణే లక్ష్యం



ప్రజాశక్తి-మంగళగిరి

గుడ్ షెఫర్డ్ కాన్వెంట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఇంచార్జ్ సిస్టర్ లతా ఆధ్వర్యంలో గురువారం బాలల హక్కుల పరిరక్షణ కోసం స్టెంతనింగ్ ఆఫ్ కమ్యూనిటీ బెస్ట్ ప్రొటెక్షన్ యూనిట్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. మంగళగిరి దళిత శిబిరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీ అధ్యక్షులుగా కురగంటి ఆదాము, కార్యదర్శిగా వి.బుజ్జి ఎన్నికయ్యారు. చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనూష మాట్లాడుతూ మంగళగిరి టౌన్ లో బాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి బాలల హక్కుల రక్షణే ఈ కమిటీ యొక్క ముఖ్య ఉద్దేశమని చెప్పారు.

గుండిమెడ క్వారీలో అక్రమ తవ్వకాలు ఆపండి

ప్రజాశక్తి-తాడేపల్లిరూరల్

ఎంటిఎంసి పరిధిలోని గుండిమెడలో గురువారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఇసుక క్వారీలో అక్రమ తవ్వకాలు ఆపాలని నిరసన కార్యక్రమం జరిగింది. బుధవారం స్థానిక రైతులు ఇసుక క్వారీ నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఆందోళన చేసిన క్రమంలో గురువారం జనసేన పార్టీ నాయకులు గుండెమెడ ఇసుక క్వారీని పరిశీలించారు. జనసేన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో క్వారీ దగ్గరికి చేరుకున్నారు. దీంతో సమాచారం అందుకున్న తాడేపల్లి మండల సీఐ శేషగిరిరావు, పోలీసులు గుండిమెడ ఇసుక క్వారీ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గుండిమెడ ఇసుక క్వారీ గడువు ముగిసిన కూడా తవ్వకాలు ఆపడం లేదని అన్నారు. సీఎం నివాసానికి కూతవేటు దూరంలో ఉన్న ఇసుక క్వారీలో అక్రమాలు జరుగుతున్న కూడా అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. జె పి గ్రూప్ పేరుతో అక్రమ తవ్వకాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇసుకను దోచుకొని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. అదేవిధంగా భవిష్యత్తు తరాల ఆస్తిని దోచుకుంటే



జనసేన పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ను ప్యాకేజీ తీసుకుంటున్నారని విమర్శించిన వైసిపి నాయకులు, ఏ ప్యాకేజీలు తీసుకుని వైసీపీ నాయకులు అక్రమ ఇసుక తరలిస్తున్నారో చెప్పాలన్నారు. ఇసుక క్వారీలలో అక్రమ తవ్వకాలు ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. అనంతరం పోలీసులను కలిసి, క్వారీలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలను ఆపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బేతపూడి విజయ్ శేఖర్, జిల్లా కార్యదర్శి రావి రమ,తాడేపల్లి మండల జనసేన అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, ఎర్రబాలెం గ్రామ కార్యదర్శి కాపరవుతూ సుందరయ్య పాల్గొన్నారు.

'యువగళా'నికి తరలిన టిడిపి తాడేపల్లి నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని గుండి మెడలో తాడేపల్లి మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో గురువారం నంద్యాలలో జరుగుతున్న నారా లోకేష్ యువగళం పాదయాత్రకు తాడేపల్లి మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలిపేందుకు పెద్ద ఎత్తున బయలుదేరి వెళ్లారు. పాదయాత్రకు బయలుదేరి వెళ్లిన వారిలో తెలుగుదేశం తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, గుంటూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి పఠాన్ కాసిం ఖాన్, తాడేపల్లి మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు గుండి మెడ రమేష్ బాబు, గుండెమెడ గ్రామ అధ్యక్షులు చిగురుపాటి సుబ్బారావు, వీరిశెట్టి శ్రీనివాసరావు, కంచర్ల రంగారావు, కొల్లి సురేష్, అనుమోలు వీరాంజనేయ ప్రసాద్ ఉన్నారు.



కరెంటు కోతలు తగదు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ప్రజలు పలు సమస్యలతో అల్లాడిపోతున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు గురువారం ప్రత్తిపాడు మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో నాయకులు ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం పూర్తయిన సందర్భంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరెంటు కోతలు విధిస్తున్నారని ఈ సమస్య ఎక్కువగా ఉందని 24 గంటలు కరెంటు ఇస్తానన్న ముఖ్యమంత్రికి ఇప్పుడు ఏమైందని, ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారని, బిల్లులు చూస్తే డబుల్ వస్తున్నాయని దీనిపై త్వరలో కార్యచరణ రూపొందిస్తామని అన్నారు. గుంటూరు ఛానల్ పొడిగింపు ఈ ఎండాకాలం పోతే ఖరీఫ్ మొదలవుతుం దని తద్వారా పనులు చేయడానికి కూడ ఆటంకం అవుతుందని అన్నారు.

సేవావజ్ర,సేవారత్న అవార్డులు

ప్రజాశక్తి-అమరావతి: అమరావతి మండల పరిధిలో ఉత్తమ ప్రతిభ కన బరిచిన ఒక వాలంటీర్ సేవా వజ్రకు, ఐదుగురు వాలంటీర్ల కు సేవా రత్న అవార్డులకు ఎంపికయ్యారని ఎంపీడీఓ పి.మాధురి తెలిపారు. గురువారం నిర్వ హించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనపరిచిన వాలంటీర్లలో దిడుగు సచివాలయ పరిధిలోని ఓరుగంటి అనూష కు వజ్ర పురస్కార అవార్డు లభించిందని అన్నారు, అమరావతి -1 సచివాలయానికి చెందిన కె. ఉషారాణి , నర కుళ్ళపాడు సచివాలయానికి చెందిన యన్. శ్రీకాంత్, అత్తలూరు సచివాలయానికి చెందిన జి.భ్రమయ్య , ఉంగుటూరు సచివాలయానికి చెందిన శ్రీహరి శివాజీ , వైకుంఠపురం సచివాలయానికి చెందిన యన్.శ్రీనివాసరావు ఎంపికైనట్లు తెలిపారు.

నేడు సుందరయ్య వర్ధంతి సభ

ప్రజాశక్తి-తాడేపల్లి

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సభ శుక్రవారం సాయంత్రం తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు తెలిపారు. సభలో సిపిఎం రాష్ట్ర నాయకులు వి.ఉమామహేశ్వరారవు పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు పానకం పంపిణీ

సుందరయ్య వర్ధంతి సందర్భంగా సుందరయ్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం తాడేపల్లి బోసు బొమ్మ సెంటర్‌లో పానకం పంపిణీ చేయనున్నట్లు కన్వీనర్ గాదె సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నేతాజీ సెంటర్‌లో సుందరయ్య చిత్రపటాలను ఏర్పాటు చేశారు. మామిడి తోరణాలతో అలంకరించారు.



పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

ప్రజాశక్తి - తుళ్లూరు

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు,వి ప్రసాద్, లకుమాదేవి, నీలోఫర్, వాణి విజ్ఞప్తి చేశారు.గురువారం రాయపూడిలోని అన్ని పాఠశాలల హెచ్ ఎం లు,ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఎన్ రోల్ మెంట్ డ్రైవ్ నిర్వహించారు. మానవ హారంగా ఏర్పడ్డారు. ఒకటవ తరగతి నుంచి ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన జరుగుతుందని,ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్,మహిళా పోలీస్, గ్రామ వాలంటీర్లు, విద్యా కమిటీ చైర్మెన్ పాల్గొన్నారు.



కళాకారుడు శివరామ ప్రసాద్‌కు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శకపురుషుని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్లో గురువారం ఎన్టీఆర్ నటించిన శ్రీకృష్ణతులాభారం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శతాబ్ది ఉత్సవాల్లో రోజుకొక కళాకారులను సత్కరించే కార్యక్రమంలో భాగంగా ప్రముఖ పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు భోగాది శివరామప్రసాద్ ను పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆవుల చక్రవర్తి, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, డాక్టర్ గాజుల శ్రీనివాసరావు తదితరులు ఎన్టీఆర్ జ్ఞాపికను అందించి సత్కరించారు.

నిడమర్రుకు ట్యాంకర్ ద్వారా తాగునీరు

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలో తాగునీటిని లిఫ్ట్ చేసే మోటర్లు మరమ్మత్తులకు గురికావడంతో గ్రామంలో ఉన్న పల్లెకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. టిడిపి నేత నారా లోకేష్ సహకారం తో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేపట్టారు. బుధవారం నుంచి జలధార పేరుతో మంచినీటి ట్యాంకర్‌ను పంపించి తాగునీటిని సరఫరా చేయిస్తున్నారు. వాటర్ ట్యాంకర్లను పంపి నీటి సరఫరా చేస్తున్నందుకు నిడమర్రు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. మంచినీటి పునరుద్దరణ జరిగే వరకు ట్యాంకర్ ల ద్వారా మంచినీటి సరఫరా జరుగుతుందని గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కుర్రా బ్రహ్మం, కార్యదర్శి కట్టేపోగు శ్రీనివాసరావులు తెలియజేశారు.





గుంటూరులో ప్రదర్శన



సత్తెనపల్లిలో కొవ్వొత్తులతో నిరసన

రెజ్లర్ల పోరాటానికి సంఘీభావ వెల్లువ



మంగళగిరిలో ధర్నా



చిలకలూరిపేట

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా విలేకర్లు

ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లకు మద్దతుగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గురువారం పలు సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, ప్రదర్శనలు చేపట్టారు. ఇందులో భాగంగా **గుంటూరులోని** ఇన్నర్ రింగురోడ్డులోని గాంధీ బొమ్మ వరకు ఐద్వా, సిఐటియు, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రదర్శన చేశారు. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్న బిజెపి ఎంపీ, రెజ్లర్ సంఘం అధ్యక్షులు బ్రిజ్‌భూషణ్‌సింగ్‌ను వెంటనే ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేసి పదవి నుంచి తొలగించాలని నాయకులు డిమాండ్ చేశారు. బిజెపి చెబుతున్న బేటీ బచావో బేటీ పడావో నినాదం ఆచరణలో ఎక్కడా కనిపించడం లేదని మండిపడ్డారు. రెజ్లర్లు పతకాలు సాధించినప్పుడు గొప్పలు చెప్పిన మోడీ, తన పార్టీ నాయకులే రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతుంటే చూస్తూ ఊరుకున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.శ్రీనివాస్, ఐద్వా నాయకులు పద్మ, రమణ, సుహాసిని, నాగలక్ష్మి, ఓబులేశ్వరి, ఫాతిమా, శాఖ సహాయ కార్యదర్శి ఎస్.కె.మస్తాన్‌వలి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పండు, మన్సూర్ పాల్గొన్నారు. పాత గుంటూరు మాచిరాజు వారి వీధి, పొత్తూరు వారి వీధి, కోబాల్టుపేట, ప్రగతి నగర్ ప్రాంతాల్లో నిరసనలు చేపట్లగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్టను ఇనుమడింప చేసిన రెజ్లర్ల ఆందోళనను పట్టించుకోకుండా, వేధింపులకు పాల్పడిన పార్టీ నాయకుడ్ని రక్షించాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమాల్లో ఐద్వా నగర అధ్యక్ష కార్యదర్శులు జి.రమణ ఎ.కళ్యాణి, ఎం.కృష్ణకుమారి, రాజకుమారి, నాగలక్ష్మి, మేరీ, పద్మ, కల్పన మహిళలు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన **నరసరావుపేటలోని** సత్తెనపల్లి రోడ్డులో జిల్లా క్రీడా ప్రాంగణంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లీశ్వరి, సిఐటియు పట్టణ కార్యదర్శి సిలార్ మసూద్ మాటాల్లఆరు. నాయకులు కె.రామారావు, ఐ.కోటేశ్వరరావు, ఎస్.దుర్గాభాయ్, షేక్ ఫాతిమా, పి.శ్రీనివాసరావు, హుస్సేన్, సుభాని, బి.సాయి కుమారి, శ్రీనునాయక్, మస్తాన్‌వలి పాల్గొన్నారు. **చేబ్రోలులో** ప్రదర్శన చేపట్టగా సిఐటియు గుంటూరు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడారు. మండల కార్యదర్శి హనుమంతరావు, నాయకులు షర్ఫుద్దీన్, పూనం, కిన్నెర పాల్గొన్నారు. **చిలకలూరిపేట**లోని ఎన్‌ఆర్‌టి సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, సిఐటియు, యుటిఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఆనంతరంగా ర్యాలీగా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గల శుభాస్ చంద్రబోస్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. యు.సిద్ధు, నవిత, పెద్దిరాజు, నాగమ్మభాయి, శారదా, ఎస్.బాబు, ఎస్.లూథర్ పాల్గొన్నారు. **సత్తెనపల్లి**లోని పుతుంబాక భవన్ ఆవరణలో ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. పట్టణ కార్యదర్శి గద్దె ఉమాశ్రీ మాట్లాడారు. నాయకులు డి.విమల, జి.రజిని, టి.లక్ష్మి, స్పందన, కోటేశ్వరమ్మ, షేక్ సైదులు, రాజకుమార్, హరిపోతారాజు, మస్తాన్‌రావు, పురుషోత్తం పాల్గొన్నారు. **తుళ్లూరు**లోని మల్కాపురం సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు మాట్లాడారు. నాయకులు గ్రేస్, సుజాత, శ్రీలత పాల్గొన్నారు. **తెనాలి**లోని రావి అమ్మయ్య చౌక్‌లో ప్రదర్శన చేపట్టగా సిఐటియు నాయకులు బాబూప్రసాద్ మాట్లాడారు. షేక్ హుస్సేన్‌వలి, ఎం.సాంబశివరావు, జి.వెంకటసుబ్బయ్య, ఎస్‌కె ఆషాబి, ఎస్‌కె బాజి, కె.శ్రీనివాసరావు, ఎస్‌కె సోదిత, ఎన్.రాజ్యలక్ష్మి, ఎన్ఎస్ లలిత, ఎన్.సాంబశివరావు పాల్గొన్నారు. **మంగళగిరిలో** అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. నాయకులు ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడారు. ఎం.రవి, బి.వెంకటేశ్వర్లు, వై.కమలాకర్, పి.పూర్ణ, కె.గోపి, కె.వెంగమ్మ, పి.మేరీ, జి.నాంచారమ్మ, ఎస్.శాంతి పాల్గొన్నారు. **మంగళగిరి రూరల్‌లోని** రాజధాని గ్రామమైన ఎర్రబాలెంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి మాట్లాడారు. నాయకులు ఒ.రామారావు, టి.ఆదిలక్ష్మిపాల్గొన్నారు. కాజలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మండల కార్యదర్శి ఎస్.విజయలక్ష్మి, సుమ, తిరుమల భారతి పాల్గొన్నారు. నిడమర్రు నిరసనలో ఎం.భాగ్యరాజు, జి.నాగేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వర్లు, కె.ప్రకాశరావు పాల్గొన్నారు. **తాడేపల్లి** పట్టణంలోని కృష్ణుని గుడి సెంటర్‌లో గురువారం సిఐటియు ఆధ్వర్యంలో సంఘీభావ సభ నిర్వహించారు. పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు మాట్లాడారు. **ఫిరంగిపురం** మండలంలోని పొనుగుపాడులో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. కాజా మస్తాన్ వలి, జివిఆర్, షేక్ మస్తాన్‌వలి మహిళలు పాల్గొన్నారు



తాడేపల్లి



కాజా



పొనుగుపాడు



తెనాలి



ఎర్రబాలెం



చేబ్రోలు

విదేశీ విద్యాదీవెనకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద 2023-24 విద్యా సంవత్సరానికి పిజి, పిహెచ్‌డి, ఎంబిబిఎస్ కోర్సులు అభ్యసించటానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ, ఉప సంచాలకులు గురువారం ఒక ప్రటకనలో తెలిపారు. కాపు విద్యార్థులు సహా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. తాజా క్యూఎస్‌గానీ, టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ ర్యాంకింగ్స్-2023 ప్రకారం టాప్ 50 సంస్థలు/యూనివర్సిటీల్లోని 21 సబ్జెక్టులు, దాదాపు 379 యూనివర్సిటీలు/ సంస్థలు (మొత్తం మీద) ఈ పథకం కింద ఆర్థిక సహాయం పొందటానికి అర్హత కలిగి ఉన్నాయని చెప్పారు. క్వాలిఫైయింగ్ కోర్సులో 60శాతం మార్కులు గానీ అందుకు సమానమైన గ్రేడ్ ఉన్న విద్యార్థులు ఈ పథకం కింద అర్హులని తెలిపారు. ఎంబిబిఎస్ కోర్సులో చేరాలనుకునే ఇంటర్మీడియట్ విద్యార్థులు నీట్ పరీక్షలో అర్హత సాధించి ఉండాలని పేర్కొన్నారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద అర్హులైన, ఎంపికైన వారికి 100 శాతం ట్యూషన్ ఫీజుగానీ, రూ.1.25 కోట్లు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విద్యార్థులకు ఏది తక్కువైతే అది మంజూరవుతుందని తెలిపారు. ఇతర కేటగిరీ విద్యార్థుల విషయంలో వందశాతం ట్యూషన్ ఫీజుగానీ, రూ.కోటి, ఏది తక్కువైతే అది మంజూరవు తుందని వివరించారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలకు మించకూడదని, నోటిఫికేషన్ ప్రచురణ తేదీ నాటికి గరిష్ట వయస్సు 35 ఏళు మించకూడదని, ఆదాయ ధ్రువపత్రం పథకం కోసం నిర్దేశించిన ఫార్మాట్‌లో ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు https://jnanabhumi.ap.gov.inలో అందించిన వెబ్ లింక్ ద్వారా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో జూన్ 10వ తేదీలోగా నమోదు చేసుకోవాలని, ఇతర వివరాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఉద్యోగుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-గుంటూరు



నవరత్న పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు తీసుకొస్తున్న ప్రభుత్వం, ఉద్యోగుల కుటుంబాల్లో మాత్రం చీకటి నింపుతుందని ఏపీజేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీజేఏసీ అమరావతి మూడో విడత నిరసల్లో భాగంగా 'ఉద్యోగుల ఆవేదన చెప్పుకుందాం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే ముస్తఫాకు సమస్యలపై వినతిపత్రం అందచేశారు. అన్ని శాఖల్లో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని తెలిపారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాట ఇస్తే చేసి తీరుతారని, ప్రభుత్వ ఉద్యోగుల విషయంలోనే వెనకడుగు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో ఎంతో నిబద్ధత కనబరుస్తున్నారని, అందుకే ప్రజలకు ప్రభుత్వం దగ్గర కాగలుగుతోందని అన్నారు. అలాంటిది ప్రభుత్వంలో భాగస్వాములమైన ఉద్యోగులపై ఎందుకంత వివక్ష చూపుతున్నారో అర్థం కావట్లేదన్నారు. ప్రతి ఉద్యోగి ఏదోఒక రకంగా ప్రభుత్వ తీరు కారణంగా ఇబ్బందులు పడుతున్నారని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ మరియు కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇలా అన్ని విభాగాల్లో అనేక రకాల సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. వీటిని పెద్ద మనసుతో ఆలకించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి జిల్లా సెక్రటరీ కిరణ్‌కుమార్, నాయకులు ఈదులమూడి మధుబాబు, కరిముల్లా, అయూబ్ ఖాన్ పాల్గొన్నారు.